క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం పరిధిలో హై టెన్షన్ లైన్లలో నిర్వహణ పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు లక్ష్మీనారాయణపురం, లెప్రసీ కాలనీ, హనుమాన్ విగ్రహ ప్రాంతం, తాటిచెట్లపాలెం సిగ్నల్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్: మురళీనగర్–మాధవధార వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వెలమ కుటుంబాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పాశల సూర్యనారాయణ, వెన్నెల సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్‌లో ఇంటర్ పూర్తి చేసిన వారు, పదో తరగతి పాసైనవారు, వివిధ సాంకేతిక విద్యా పరీక్షల్లో పాలిసెట్, ఈఏపీఈసెట్, జేఈఈ, నీట్, సివిల్స్‌లో ఉత్తమ ర్యాంకులు పొందిన వెలమ సామాజిక వర్గ విద్యార్థులు ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు మురళీనగర్‌లోని వెలమ సంక్షేమ సంఘం కార్యాలయంలో లేదా 99496 57734 నంబర్‌లో సంప్రదించాలని వారు కోరారు.

ఉపనిషత్తుల్లో ఆత్మజ్ఞాన తత్వం



ప్రసంగిస్తున్న దేవులపల్లి పద్మజ

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో జరుగుతున్న ఆధ్యాత్మిక లహరి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఉపనిషత్తుల వైశిష్ట్యంపై రచయిత్రి దేవులపల్లి పద్మజ ప్రసంగించారు. ముందుగా ముఖ్య అతిథి పూర్ణానంద స్వామి ఉపనిషత్తులను పరిచయం చేశారు. చివరిగా లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అనుగ్రహ భాషణం చేశారు. ఉపనిషత్తులు వేదాంతమని, అనేత సత్యాలను, ఆత్మతత్వాన్ని లోకానికి రుషులు అందించారని ఉపదేశించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ సారథ్యంలో వక్త పద్మజను సన్మానించారు.

‘శ్రావణ సఖి-2’ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పేడాడ రమణికుమారి, నిర్వాహకులు

మద్రిపాలెం: కార్యేషు ఈవెంట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రావణ సఖి-2 కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి తన నివాసంలో నిర్వాహకులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తూ, ప్రతిభను చాటుకుంటున్నారన్నారు.

విశాఖలో 10 నుంచి వారాహి యాత్ర

సీతంపేట: ఈ నెల 10 నుంచి 19 వరకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ విశాఖలో వారాహి యాత్ర చేపడతారని ఆ పార్టీ నేత, కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పది రోజుల పాటు యాత్ర, రెండు బహిరంగ సభలు, మొదటి రోజు బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. జనవాణి కార్యక్రమంలో భాగంగా సమస్యలపై విశాఖ ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు. రుషికొండ, ముదపాక, విస్సన్నపేట, దసపల్లా, సీబీసీఎస్‌సీ, ఎర్రమట్టి దిబ్బలు ప్రాంతాలను పవన్ సందర్శిస్తారన్నారు. విశాఖ సమస్యలపై మేధావులతో చర్చా కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.



43వ వార్డులో టేక్ హోం రేషన్ అందజేస్తున్న కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ



49వ వార్డులో పౌష్టికాహారం కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

ప్రభుత్వ ధ్యేయం.. ఆరోగ్యకర సమాజం

- తల్లిపాల వారోత్సవాల్లో కార్పొరేటర్లు
- గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



24వ వార్డులో కిట్లు అందుకున్న గర్భిణులు, బాలింతలతో అంగన్‌వాడీ టీచర్ గౌరి

సీతంపేట: ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పలువురు కార్పొరేటర్లు పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు(టేక్ హోం రేషన్) పంపిణీ చేశారు. 43వ వార్డు తారకరామానగర్–2 అంగన్‌వాడీ కేంద్రం, ఎంటీసీ పాలెం కేంద్రంలో ముఖ్య అతిథి కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, శిశువులు, విద్యార్థుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. పోషకాహార లోపాలు తలెత్తకుండా ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీడీపీవో ఎం.వి.కుమారి, ఏసీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్ కుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



53వ వార్డులో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ బర్కత్ అలీ

పౌష్టికాహారంతో ఆరోగ్యం

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అంగన్‌వాడీ టీచర్ గౌరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు 55 మందికి కిట్లు అందజేశామని తెలిపారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత, మాతా, శిశు మరణాలను నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ విద్యా లక్ష్మి, ఏఎన్‌ఎం కృష్ణవేణి, ఆశా వర్కర్ భవానీ, ఏఎన్‌ఎం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి సీఎం కృషి

మురళీనగర్: రాష్ట్రంలో మహిళల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు అన్నారు. వార్డులోని ఏఎస్సార్ నగర్, సూర్యానగర్–1లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సందర్శించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కిట్లు అందించారు. కార్యక్రమంలో విశాఖ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐ.రవికుమార్, వార్డు శివాలయం బోర్డు చైర్మన్, గ్రామ అధ్యక్షుడు ఎస్.వి.రమణ, ఎస్.చంద్రశేఖర్, కె.ఢిల్లీరావు, సబ్బవరపు శ్రీను, సిహెచ్.సింగ్, సిహెచ్.శ్రీను, శ్రీరాములు, కె.అప్పారావు, జె.ప్రశాంత్, ఆచారి, ఏసు, చైతన్య, జె.వెంకటరావు, బి.శివరామ ప్రసాద్, బి.శంకర్, కె.మున్నా, కె.కిషోర్, మహిళా నాయకులు వి.కమల కుమారి, సిహెచ్.శ్యామల, సిహెచ్.సరోజా, ఐ.పూర్ణ, ఆర్.వరలక్ష్మి, ఎ.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మద్రిపాలెం జాకీర్ హుస్సేన్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు కార్పొరేటర్ బర్కత్ అలీ చేతుల మీదుగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా, శిశు సంరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ‘గడప గడపకు..’



వృద్ధుడికి సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు

కంచరపాలెం: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 54వ వార్డు 104 ఏరియా, మహారాణి వీధి–2, జ్యోతినగర్, బాపూజీనగర్ ప్రాంతాల్లో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ చల్లా రజనితో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి నివాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, నాయకులు చల్లా ఈశ్వరరావు, వెంకటేష్, ఆయా వార్డుల కార్పొరేటర్లు, నాయకులు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

దోపిడీ ముఠాల హల్‌చల్

సీతమ్మధార: నగరంలోని పలు ప్రాంతాల్లో దోపిడీ ముఠాలు హల్‌చల్ చేస్తున్నాయి. విధులు ముగించుకుని అర్ధరాత్రి వేళ ఇంటికి వెళ్తున్న వారిపై దొంగలు ఎటాక్ చేస్తున్నారు. నగదు, నగల కోసం దోపిడీలకు పాల్పడుతున్నారు. ఇవ్వలేని పక్షంలో విచక్షణా రహితంగా దాడులు చేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి ఇదే తరహాలో ఘటన జరిగింది. డైమండ్ పార్కు సమీపంలో ఒక వ్యక్తి షాపు క్లోజ్ చేసి ఇంటికి వెళ్తున్న సమయంలో వెస్ట్ బెంగాల్‌కు చెందిన ముగ్గురు యువకులు అతడిని అడ్డగించి బెదిరించారు. ఆ సమయంలో షాపు యాజమానికి సంబంధించిన వ్యక్తులు వెనుక నుంచి రాగానే ఆ ముగ్గురు పరారయ్యారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలపై రాత్రి పూట తిరుగుతున్నట్లు సమాచారం. విషయం తెలుసుకుని పోలీసులు రాత్రి పూట గస్తీ పెంచారు. ఆ ముగ్గురి కోసం గాలిస్తున్నారు. ఇప్పటికే పోలీసులు సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. వెస్ట్ బెంగాల్ నుంచి పలు చోట్ల పనులకు వచ్చిన వారిపై నిఘా పెట్టారు. హోటళ్లు, నూడిల్స్ పాయింట్ల వద్ద ఎక్కువ శాతం వెస్ట్ బెంగాల్‌కు చెందిన యువకులు పనిచేస్తుంటారు. వీరిపై పోలీసులు దృష్టి పెట్టినట్లు సమాచారం.

దోమల వ్యాప్తి కట్టడికి చర్యలు



ఎన్జీజీవోస్ కాలనీలో మహిళలకు దోమ లార్వాలను చూపిస్తున్న జీవీఎంసీ ఏఎల్‌వో సిబ్బంది



సీతంపేటలో దోమలు పెరిగే ప్రదేశాలపై అవగాహన కల్పిస్తున్న మలేరియా సిబ్బంది

సీతంపేట: వర్షా కాలం నేపథ్యంలో దోమల వ్యాప్తి కట్టడికి జీవీఎంసీ, మలేరియా సిబ్బంది చర్యలు చేపడుతున్నారు. ఫ్రైడే–డ్రైడే సందర్భంగా 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీ, 25వ వార్డు సీతంపేటలో దోమలు పెరిగే ప్రదేశాలు, వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కల్పించారు. మలేరియా, డెంగ్యూ జ్వరాలను వ్యాప్తి చేసే దోమలు వారం రోజులకు మించి నిల్వ ఉన్న వర్షం లేదా తాగునీటిలో వృద్ధి చెందుతాయన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా వారానికి ఒకరోజు డ్రైడే పాటించాలన్నారు. ప్రతి శుక్రవారం నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకులు, మనీ ప్లాంట్‌లు, ఫ్రిజ్ వెనుక డ్రిప్‌బాక్‌లను శుభ్రం చేయాలని సూచించారు. గోళాలు, కుండీల్లోకి దోమలు చొరబడకుండా మూతలు పెట్టాలన్నారు. ఇంటి పరిసరాల్లో పనికి రాని వ్యర్థాలు, వాడిపారేసిన టీ కప్పులు, ఐస్‌క్రీం కప్పులు, తాగి పారేసిన కొబ్బరి బొండాలు, డ్రింక్ బాటిళ్లు వంటివి లేకుండా చూడాలని చెప్పారు. అనంతరం స్థానికులకు కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు కె.శ్రీనివాసరెడ్డి, కోట్ని శ్రీనివాసరావు, జీవీఎంసీ సూపర్‌వైజర్ కె.ఎస్.ఎస్.నారాయణ, సిబ్బంది శివ, హెల్త్ సెక్రటరీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ జెండాతో పరేడ్



జాతీయ జెండాతో పరేడ్ నిర్వహిస్తున్న దీప్ భవన్ అధికారులు, సిబ్బంది

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సాలగ్రామపురంలోని లైట్ హౌస్, లైట్ షిప్స్ విభాగం(దీప్‌భవన్) విశాఖపట్నం ఆధ్వర్యంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా శుక్రవారం సిబ్బంది జాతీయ జెండాను ఆవిష్కరించి, పలు వీధుల్లో పరేడ్ నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ముఖేష్ పర్మర్, డిప్యూటీ డైరెక్టర్ నరేష్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

సీతంపేట: శ్రీసాయి సరిగమప పదో వార్షికోత్సవం, 76వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అక్కయ్యపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు డ్రాయింగ్, సింగింగ్, రైటింగ్ పోటీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ పిల్లల బాధ్యత, హరిత తోరణం, పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు, క్లీన్ అండ్ గ్రీన్, అమ్మకు వందనం, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, బాలికల వ్యక్తిగత భద్రత తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీసాయి సరిగమప సభ్యులు సుబ్రహ్మణ్యం, సాయి లక్ష్మి, స్కూల్ హెచ్‌ఎం పద్మజ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



మద్రిపాలెంలో తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, సిబ్బంది

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీసులు మూడు రోజుల నుంచి డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. కంచరపాలెం మెట్టు, బర్మాక్యాంప్, బిర్లా జంక్షన్, మద్రిపాలెం, ఎన్ఏడీ వరకు ప్రత్యేక నిఘాతో తనిఖీలు చేపట్టగా మూడు రోజుల్లో 55 కేసులు నమోదయ్యాయి. 5వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ వీరికి రూ.4.11 లక్షల జరిమానా విధించారని సీఐ మళ్ల అప్పారావు తెలిపారు.

శెట్టిబలిజలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



అతిథుల చేతుల మీదుగా సత్కారం పొందిన వైద్యాధికారులు

సీతంపేట: శెట్టిబలిజ కులస్తులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని పలువురు వక్తలు కోరారు. శెట్టిబలిజల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శెట్టిబలిజ సంఘ నాయకులు, సభాధ్యక్షుడు కట్టా మల్లేశ్వరరావు మాట్లాడుతూ విశాఖలో శెట్టిబలిజ, యాత, శ్రీశయన, గౌడ కులస్తులు 4 లక్షల ఓటర్లు ఉన్నప్పటికీ ఏ రకమైన రాజకీయ ప్రాధాన్యం లేకపోవడం అన్యాయమన్నారు. ప్రతి నియోజకవర్గంలో తమ కులస్తుల ఓట్లు 30 వేల నుంచి 40 వేలకు ఉన్నాయని తెలిపారు. 2024 ఎన్నికల్లో శెట్టిబలిజ కులాలకు ప్రాధాన్యమిచ్చే రాజకీయ పార్టీలకు మాత్రమే తమ మద్దతు ఉంటుందన్నారు. విశాఖలో ఒక ఎమ్మెల్యే, ఒక నామినేటెడ్ పదవిని కేటాయించిన పార్టీకి మద్దతు పలుకుతామని స్పష్టం చేశారు. సింహాచలం దేవస్థానం ట్రస్టీ సంపంగి శ్రీనివాసరావు మాట్లాడుతూ శెట్టిబలిజ కులాలను సంఘటిత పరిచి, ఒక తాటిపైకి తీసుకొచ్చి త్వరలో భారీ ఎత్తున మహానాడు సభ నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా శెట్టిబలిజ కులస్తులు, వివిధ హోదాల్లో పదవీ విరమణ చేసిన ప్రముఖ వైద్యాధికారులను ఘనంగా సత్కరించారు. విశ్రాంత రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ కడలి సత్యవరప్రసాద్, మానసిక ఆస్పత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ కుమ్మిజు నరసింహారెడ్డి, పోర్టు ఆస్పత్రి డెర్మటాలజిస్ట్ యాండ్ర రాంప్రసాద్, కేజీహెచ్ గైనకాలజిస్ట్ యాండ్ర లక్ష్మీ నరసింగరావు, ఏఎంసీ ఆప్తమాలజిస్ట్ చెల్లుబోయిన మంగా వెంకట్‌లను దుశ్శాలువాతో సన్మానించారు. ఇటీవల జీవీఎంసీ కార్పొరేటర్లుగా, నామినేటెడ్ పదవులు పొందిన వారిని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కడలి సుబ్బారావు, వాసర్ల బాలకృష్ణ, కడలి శివ కేశవ నరసింహారావు, కేతా గంగరాజు, గుత్తుల వెంకటేశ్వరరావు, గుత్తుల సుబ్రహ్మణ్యం, కట్టా శ్రీకాంత్, గుత్తుల రాజశేఖర్, రాయుడు శివ రామకృష్ణ పాల్గొన్నారు.

అమ్మో.. తేనెపట్టు



మారికవలస ఆర్‌జీకే కాలనీలో నివాసాల మధ్య తేనెపట్టు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు మారికవలస జేఎన్ఎన్‌యూఆర్‌ఎం రాజీవ్ గృహకల్ప కాలనీలో నివాసాల మధ్య పెద్ద తేనెపట్టు స్థానికులను కలవరపెడుతోంది. ఇక్కడి 148వ బ్లాకులో మెట్ల మార్గంలో నిండుగా పట్టిన తేనెపట్టు రోజురోజుకూ పరిమాణం పెరిగిపోతోంది. చిన్న గాలి వీచినా, చీకటి పడినా, పొరపాటున ఏదైనా తగిలినా పెద్ద పెద్ద తేనెటీగలు ఇళ్లలోకి చొరబడి దాడి చేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

‘భర్త నుంచి రక్షణ కల్పించండి’



పిల్లలతో బాధితురాలు అల్లు శారద

సీతమ్మధార: ‘నా భర్త నుంచి నాకు ఆత్మరక్షణ కల్పించండి’ అని పోలీసులను భర్త చేతిలో దాడికి గురైన అల్లు శారద వేడుకుంది. శుక్రవారం ఆమె ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. వివరాలిలా.. జీవీఎంసీ 45వ వార్డు గురునాథ్ కాలనీలో అల్లు రాము, శారద దంపతులు నివసిస్తున్నారు. వీరికి పాప, బాబు ఉన్నారు. ఈ నెల 2వ తేదీ బుధవారం సాయంత్రం రాము మద్యం కోసం తన భార్యను డబ్బులు అడిగాడు. ఆమె తన వద్ద లేవని చెప్పడంతో అతడు కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. స్థానికుల సహకారంతో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో బాధితురాలు చికిత్స పొందింది. ఈ నేపథ్యంలో ‘సాక్షి’తో అల్లు శారద మాట్లాడుతూ తనకు తన భర్త నుంచి ప్రాణహాని ఉందని చెప్పింది. ఇద్దరు చిన్నపిల్లలతో భయంగా గడుపుతున్నట్లు వాపోయింది. తన భర్త రాము పోలీస్ స్టేషన్‌లో ఉన్నప్పటికీ రాత్రి వేళ ఇంటికి వచ్చి దాడి చేస్తాడేమోనని భయాందోళనలు చెందినట్లు తెలిపింది. పోలీసులు తనకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేసింది.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు కృషి



సంపంగి శ్రీనివాసరావును సత్కరిస్తున్న మండలి కార్యవర్గ సభ్యులు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం ధర్మానగర్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు క్రాంతి యోజన ప్రగతి మండలి కార్యవర్గ ప్రతినిధులు శ్రీకారం చుట్టారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆదేశాలతో ఆ పార్టీ నాయకుడు, సింహాచలం దేవస్థానం ట్రస్టీ సంపంగి శ్రీనివాసరావు ఆరడుగుల అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి సొంత నిధులు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా సిద్ధార్థ సేవా సంఘం శుక్రవారం నిర్వహించిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి పాటు పడాలన్నారు. అనంతరం ఆయనను మండల కార్యవర్గ ప్రతినిధులు సత్కరించారు.


అలరించిన సాంఘిక నాటికలు



అమ్మ మారిపోయింది నాటికలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం: విశాఖ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం ప్రదర్శించిన రెండు సాంఘిక నాటకలు ఆకట్టుకున్నాయి. ఈ నాటిక ప్రదర్శనలను వీఎండీఏ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణరాజు, పైడా కృష్ణప్రసాద్, జగత్‌రాయ్, నాంచారయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం తొలి ప్రదర్శనగా డి.సత్యనారాయణ దర్శకత్వంలో రావి నాగేశ్వరరావు రచించిన అమ్మ మారిపోయింది నాటికను కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. ఈ నాటికలో ప్రతి సన్నివేశం ప్రేక్షకులను కదిలించింది. రెండో ప్రదర్శనగా పుష్పమి దర్శకత్వంలో కె.వి.మెమోరియల్ ఆర్ట్స్ యూనిట్ రచించిన అడ్రస్ లేని మనిషి నాటిక ఆలోచింపజేసింది. ఈ నాటికలకు సౌజన్య ఉక్కు కళా స్రవంతి కళాకారులు ప్రదర్శించారు.

ఏఆర్ పోలీసులకు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ

ఆరిలోవ: ఏఆర్ పోలీసులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. విశాలాక్షినగర్‌లో కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన స్టాఫ్ పరేడ్‌ను ఆయన సందర్శించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ 50 సంవత్సరా లు దాటిన ఏఆర్ పోలీసులు ఆరోగ్యంపై జాగ్రలు పాటించాలని సూచించారు. ఇంత వరకు ఏఆర్ లో పనిచేస్తున్న సుమారు 200 మందికి పైగా ఉచితంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించామన్నారు. వారంతా వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడి ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ విద్యార్థులకు సివిల్స్ శిక్షణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సివిల్స్ వంటి యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ప్రత్యేకంగా ఐఏఎస్ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేస్తామని వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఆర్ట్స్ కళాశాల భవనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో పలు గదులు ఖాళీగా ఉండటాన్ని గమనించారు. గతంలోనే ఈ గదులను ఖాళీ చేసి ప్రిన్సిపాల్‌కు అప్పగించాలని సూచించినా ఎందుకు చేయలేదని విభాగాధిపతులను ప్రశ్నించారు. వెంటనే ఖాళీ గదులను స్వాధీనం చేసుకోవాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.

ఆర్ట్స్ కళాశాల మొదటి అంతస్తులో యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉపయుక్తంగా ఐఏఎస్ స్టడీ సెంటర్‌ను నెలకొల్పాడానికి అనువుగా ఉంటుందని సూచించారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేపట్టాలని పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ జి.వీర్రాజుకు సూచించారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన భవనంలో అవసరమైన మరమ్మతులు చేపట్టేలా ఇంజినీరింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. భవనానికి నూతనంగా లిఫ్ట్ ఏర్పాటు చేస్తున్న స్థలాన్ని పరిశీలించారు. భవనంలో టాయిలెట్స్ మరమ్మతులు, విద్యార్థినుల రెస్ట్‌రూమ్‌లో వసతులు పెంచాలని చెప్పారు. టాయిలెట్స్ శుభ్రం చేయడానికి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాలన్నారు.

ఐపీఆర్ క్విజ్ విజేతలకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ప్రపంచ మేధో హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూలోని డీపీఐఐటీ–ఐపీఆర్ చైర్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 900 మందికిపైగా విద్యార్థులు పోటీ పడ్డారు. ఏయూ బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థిని ఎ.వైష్ణవి ప్రథమ, చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి బి.భాస్కరరావు ద్వితీయ, ఏయూ సీఎస్ఈ విద్యార్థిని ఎం.హేమప్రేరణ తృతీయ బహుమతిని సాధించారు. విజేతలకు ఏయూ వీసీ తన కార్యాలయంలో ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఏయూ డీపీఐఐటీ–ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, యు.అశోక్ హేమంత్, హరిత పాల్గొన్నారు.